


ఈదురుగాలులతో నేలకొరిగిన అరటితోటలు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మండలంలో తోణాంలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా వీచిన ఈదురు గాలుల తో సుమారు 50 ఎకరా ల్లో అరటి తోట నేలకొరి గింది. దీంతో రైతులు ఎంతో కష్టపడి పండిం చుకుంటున్న పంట కళ్ల ముందే పడి పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తోణాంలో నేలకొరిగిన అరటిపంట

విద్యార్థుల మరణాల నివారణకు చర్యలేవీ?

వైద్యమందక రాలిపోతున్న విద్యా కుసుమాలు
పట్టించుకోని పాలక ప్రభుత్వాల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో గత కొన్నేళ్ల నుంచి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు సకాలంలో వైద్యమందకపోవడంతో వ్యాధులు బారిన పడి మృత్యుఒడికి చేరుతున్నారు. అయినా పాలక ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు నివారణా చర్యలు చేపట్టడంలో శ్రద్ధ చూపడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానికంగా వైద్యమందించే ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యమందక విద్యార్థులు మరణిస్తున్నారని పలుమార్లు గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు నెలలు తరబడి డైట్ బిల్లులు పెండింగ్ ఉండడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థుల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తుందని గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ప్రతి ఏటా మన్యం జిల్లాలో వందలాది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరడం పరిపాటిగా మారుతుంది. ఎంతో ఆసక్తితో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు అనారోగ్యానికి గురి కావడంతో చదువుకు దూరమవుతున్నారు. మరోవైపు సకాలంలో వైద్యమందక వ్యాధి ముదిరి ప్రతి ఏటా కనీసం ఐదు నుంచి పది వరకు గిరిజన విద్యార్థుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు ఏదో ఒక కారణంతో పసిప్రాయంలోనే మృత్యుఒడికి చేరుతూనే ఉన్నారు. విద్యార్థులు మరణించిన సందర్భాల్లో మాత్రమే జిల్లాస్థాయి, ఐటిడిఎ అధికారులు ఆశ్రమ పాఠశాలల పరిశీలన వరకే పరిమితం కావడం కనిపిస్తోంది.

గతంలో నెల రోజుల్లో నాలుగైదు ఆశ్రమ పాఠశాలలను డిడి, పిఒ తదితర ఉన్నతాధికారులు సందర్శించే సందర్భాలు ఉండేవి. విద్యార్థుల మరణాలు అరికట్టడం, మరణాలకు గల కారణాలు వంటి వాటిపై విశ్లేషణ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా కొరవడింది. దీంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఏదో ఒకచోట చనిపోతూనే ఉన్నారని గిరిజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్తహీనత, జ్వరం వంటి లక్షణాలతో విద్యార్థులు మరణిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. చదువుకునే పసి ప్రాయంలో వివిధ వ్యాధులతో అనారోగ్యం బారిన పడి నిండు నూరేళ్లు జీవించాల్సిన పసిమొగ్గలు 16ఏళ్లకే మృత్యుఒడికి చేరుతున్నారు. దీంతో ఆ ఇంట విషాదాన్ని నింపుతున్నారు. ఈ ఏడాది మక్కువ మండలం ఎర్రసామంత వలస ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థి సీదరపు అశోక్ అనారోగ్యంతో మృతి చెందాడు. పాచిపెంట ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని ఎన్ శ్వేత, గుమ్మలక్ష్మీపురం మండలం కె డి కోలని ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న బిడ్డిక సీత అనారోగ్యంతో మృతి చెందింది.

నిత్యం అనారోగ్యం బారిన

జిల్లాలోని పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 ఆశ్రమ పాఠశాలలు, వసతి గహాలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో43 ఆశ్రమ పాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు నిత్యం అనారోగ్యంతో బాధపడుతూ సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లడం పరిపాటిగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువమంది విద్యార్థులే కనిపిస్తున్నారు. వసతి గృహాల్లో ఆరోగ్య సిబ్బందిలేక పోవడంతో విద్యార్థులు వైద్యం కోసం బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు చెబుతున్నారు.



ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు



అనారోగ్యం బారినపడి మృతి చెందిన గిరిజన విద్యార్థులు వంశీ, అశోక్ (ఫైల్‌ఫొటో)

గత ఏడాది విద్యార్థుల మరణాలు

గత ఏడాది జిల్లాలో నెల రోజుల్లో నలుగురు గిరిజన విద్యార్థులు అనారోగ్య బారిన పడి మృతి చెందడం బాధాకరం. భద్రగిరి ఎపిఆర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఆరిక చరణ్ తేజ్ మరణించాడు. సీతంపేట మండలం పెద్దపల్లంకి వలసకు చెందిన బిడ్డిక కార్తికేయ(7) మలేరియా బారిన పడి మృత్యువాత పడ్డాడు. అలాగే మక్కువ మండలం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బిడ్డిక మహేంద్ర జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హిమరిక ప్రమీల పది రోజుల కిందట బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందింది.

ఆసుపత్రుల్లో వైద్య సేవలు అంతంత మాత్రమే....

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపడలేదు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా రోగులకు అన్ని రకాలైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో వైద్యం గిరిజన విద్యార్థులకు అందని ద్రాక్ష గానే మిగిలిపోతుంది.

ఆరోగ్య సిబ్బందిని నియమించాలి

మన్యం జిల్లాలోని ఐటిడిఎల పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బందిని ప్రభుత్వం నియమించాలి. విద్యార్థులకు వైద్య సేవలందేలా చూడాలి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. వారానికోసారి వైద్య శిబిరాలు నిర్వహించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

డైట్ బిల్లుల్లేవు..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నా మని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ రూపంలో కానరావడం లేదు. వసతి గృహాలకు ఐదు నుంచి ఏడు నెలలుగా విద్యార్థుల భోజనాల బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో సరైన పౌష్టికాహారం లేక వైద్యమందక విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తున్నారు.

పల్లా సురేష్ ,
గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు.



ఎండల తీవ్రకు జనసంచారంలేని పార్వతీపురంలో ప్రధాన రహదారి

రారెత్తిస్తున్న ఎండలు

- జియ్యమ్మవలసలో 43.4 డిగ్రీలు నమోదు
- నిర్మానుష్యమైన రహదారులు
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గత కొద్ది రోజులుగా తన ప్రతాపం చూపిస్తున్న భానుడు ఆదివారం జిల్లాలోని అన్ని మండలాల్లోనూ నిప్పులు కురిపించాడు. జిల్లాలో 40డిగ్రీ ఉష్ణోగ్రత దాటిపోయింది. అత్యధికంగా జియ్యమ్మవలస మండలంలో 43.4డిగ్రీ ఉష్ణోగ్రత్త నమోదైందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమైపోతుంది. దీంతో ఉదయం 9గంటలకే రహదారిలో జనసమ్మర్థం లేక బోసిపోయాయి. ఇందుకు నిదర్శనం ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలను చూస్తే అర్థమౌతుంది. ఉదయం 7గంటల నుంచి వాతావరణం వేడెక్కడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో మక్కువతో పాటు మరికొన్ని మండలాల్లో చిరుజల్లులు కురిసినా వేసవి నుండి ఏమాత్రం ఉపశమనం దొరకలేదు. రానున్న రోజుల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ, విపత్తుల నివారణ శాఖకు చెందిన అధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే ప్రజలు ముందస్తుగా తీసుకోవాలని జాగ్రత్తలను కూడా వివరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల డీహైడ్రేషన్ పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటల తర్వాత బయటకు రాకుండా, వచ్చినా నూలు దుస్తులు ధరించడం, శీతలపానీయాలు సేవించడంతో పాటు తప్పనిసరిగా తలకు టోపీ ధరించాలని విపత్తు నివారణ శాఖ ప్రజలను అప్రమత్తమత్తం చేస్తోంది.

ఆదివారం జిల్లాలోని నమోదైన ఉష్ణోగ్రత వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మ వలసలో అత్యధికంగా 43.4 డిగ్రీలు నమోదు కాగా, సాలూరు 42.2, పాలకొండ 42.1, సీతంపేట 40.6 అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే గుమ్మలక్ష్మీపురం 40.6 డిగ్రీలు, సీతానగరం 40.1, పార్వతీపురం 39.1, భామిని 41.6, పాచిపెంట 40.2, మక్కువ 40.9, బలిజిపేట 40.9, కొమరాడ 38.7, వీరఘట్టం 41.6, గరుగుబిల్లి 39.9 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జనసేనలో చేరిన భూదేవి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజక వర్గానికి చెందిన టిడిపి నాయకులు, నారీశక్తి రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సమాజ సేవకురాలు పడాల భూదేవి (సీతంపేట) జనసేన పార్టీలో చేరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనకాపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆదివారం సాయంత్రం పడాల భూదేవి జనసేనలో చేరారు. ఈ మేరకు ఆమెకు పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఆశీస్సులతో జనసేనలో చేరడం ఆనందం కలిగించిందన్నారు భూదేవి వెంట మాజీ జడ్పిటిసి సామంతుల దామోదరరావు, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ ఖండాపు జ్యోతి, సీనియర్ టిడిపి నాయకులు ఖండాపు వెంకట రమణమూర్తి తదితరులు ఉన్నారు. ఈ మేరకు పడాల భూదేవిని సీనియర్ టిడిపి నాయకులు, మండల మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ సి.ఎల్. నాయుడు, మాజీ ఎంపీపీ సుమంత్ నాయుడు, గుమ్మడి సింహాద్రి, ఎస్.ఎస్.ప్రకాష్ రావు, జంపు చంద్రశేఖర్, కోనే శ్రీధర్ , చొంగ రమాదేవి, సవర కుంపి తదితరులు అభినందించారు.



పవన్‌కల్యాణ్‌కు బొకేను అందజేస్తున్న భూదేవి

మిమ్స్ ఉద్యోగుల అరెస్టు దారుణం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యల పరిష్కారం కోసం రెండు నెలలుగా పోరాటం చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులను, వారికి మద్దతుగా నిలిచిన సిఐటియు నాయకులను అరెస్టు చేయడం దారుణమని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, కె.రామారావు ఆధ్వర్యాన ఆదివారం స్థానిక థామస్‌పేట వద్ద లోకం మాధవి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్‌ను కలిసి, మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా లోకం మాధవి, కడగల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యానికి అధికార వైసిపి నేతలు తెరవెనుక ఉండి డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 300మంది మిమ్స్ ఉద్యోగుల ఆకలి మంటలు ప్రభుత్వానికి పట్టవా? అని మండిపడ్డారు. మహిళలను రాత్రిపూట స్టేషన్లో నిర్బంధించడాన్ని ఖండించారు. జైల్లో ఉన్న కార్మిక కుటుంబాలను పరామర్శించడానికి వచ్చిన సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం, మహిళలని కొట్టడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికే ప్రమాదమని ఆందోళన వ్యక్తంచేశారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన పోరాటానికి అండగా నిలుస్తామని ప్రకటించారు.

విజయనగరం టౌన్ : మిమ్స్ ఉద్యోగులను, వారికి అండగా నిలిచిన సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ఖండించారు. తక్షణమే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఆంధ్రా - ఒడిశా సరిహద్దుల్లో ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్లమెంటు, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలను చేపడుతున్నారు. ఈ మేరకు మండలంలోని చెముడుగూడ పంచాయతీ, తాటిశీలలో ఏర్పాటు చేసిన పోలీసుల చెక్పోస్ట్ వద్ద ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రా నుంచి ఒడిశా వైపు వెళ్లే వాహనాలను, అలాగే ఒడిస్సా రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రంలోకి వస్తున్న పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలను చేపట్టారు. భారత ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఉండేందుకు పోలీసు గస్తీని ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని అన్నారు. వాహనాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సీసాలు గాని, డబ్బులు గానీ తరలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు చెక్పోస్ట్ వద్ద తమ వాహనానికి సంబంధించిన పత్రాలను చూపించి వాహన నెంబర్ను పోలీసులకు చూపించి వాహనాన్ని నడిపేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసే

ఎజెండాను అన్ని పార్టీలు ప్రకటించాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ


రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు మున్సిపాల్టీల్లోనూ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేసేలా, పర్మినెంట్ కార్మికుల గ్రాడ్యుటీ, పిఎఫ్, ఇతర సమస్యలు పరిష్కరించేలా వారి వారి మేనిఫెస్టోలో ఎజెండా చేర్చేలా నిర్ణయం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొండ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు సిహెచ్ సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో దాదాపు కార్మిక హక్కులపై ఈ ఐదేళ్లలో దాడులు పెరిగాయని, లేబర్ కోడ్, కార్మికులకు ఉన్న చట్టాలను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుంటే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షాలన్నీ వాటిని నిలదీసే పరిస్థితి లేకపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితి కార్మికులకు నష్టం చేస్తుంది తప్ప లాభం చేకూర్చదని తెలిపారు. దేశంలో ప్రజలు కార్మికుల మధ్య కులాలు, మతాలు వారీగా మత చిచ్చుపెట్టే వారికి కార్మిక వర్గం దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో కార్మికులకు న్యాయం జరగాలంటే కచ్చితంగా అన్ని పార్టీలు వారి మేనిఫెస్టోలలో కార్మికుల ప్రయోజనాలపై స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. పాలకవర్గాలు పురపాలక సంఘాలను నిధులు లేకుండా చేయడం ద్వారా ఉత్సవ విగ్రహాల్లా మార్చే స్థితికి తీసుకొస్తున్నాయని విమర్శించారు. ఇందులో మొదటి నష్టపోయేది పురపాలక కార్మికులేనని, పనిముట్లు చాలక, జీతాలు రాక, కార్మికులకు ఇస్తున్న బెనిఫిట్స్ ఇవ్వక, దయనీయ పరిస్థితి రాష్ట్రంలో ఉందని, అందుకే స్థానిక సంస్థలు బలోపేతం అయ్యేలా అన్ని పక్షాలు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకున్నారని, అట్టడుగు స్థితి నుంచి యూనియన్ పోరాటాల ద్వారా హక్కులు పొందామని రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు కార్మికులకు అండగా వారి ఎజెండాలను తయారు చేసి, భద్రతను ఇచ్చేలా కార్మిక వర్గం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పాలకొండ పట్టణ కమిటీ కార్యదర్శి సిహెచ్ సంజీవి కోశాధికారి పి.వేణు మాట్లాడుతూ పట్టణాల్లో జనాభా గణనీయంగా పెరుగుతున్నా కార్మికుల సంఖ్యను పెంచడం లేదని, దీనివల్ల పని భారం పెరిగే ఉన్నవారు తీవ్ర పని ఒత్తిళ్లకు గురవుతున్నారని అన్ని పక్షాలు ఎజెండాల్లో కార్మికుల సంఖ్యను పెంచేలా నిర్ణయాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం ప్రతినిధులు సిహెచ్ శ్రీదేవి, పడాల విమల, చింతల కార్తీక్, పడాల మణి, చింతల రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దావాల రమణారావు, పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

నిరంతర విద్యుత్తు సరఫరానే ధ్యేయం

- గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేస్ కరెంటు పంపిణీ
- 24 గంటల్లో ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు
- 'ప్రజాశక్తి'తో విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ముఖాముఖి



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'నిరంతర విద్యుత్తు సరఫరా చేయడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. అధికారులు, సిబ్బందితో వారానికి రెండు దఫాలుగా సమీక్ష చేయడంతో అంతరాయానికి ముకుతాడు వేయగలుగుతున్నాం. గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేస్ విద్యుత్తు సరఫరా చేయడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. దీంతోపాటు సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో భాగంగా డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించాం. ఫలితంగా బకాయిల భారాన్ని తగ్గించడానికి పాటుపడుతున్నాం. విద్యుత్తు చౌర్యం నిరోధించడంలో భాగంగా తనిఖీలను చేపడుతున్నా'మని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలోని విద్యుత్తు సర్వీసులు ఎన్ని? విద్యుత్తు వినియోగం ఎలా ఉంది.?


జిల్లాలోని సబ్‌డివిజన్ల పరిధిలో 9,64,006 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 7,92,167 గృహ వినియోగ కనెక్షన్లు, 55,552 వ్యవసాయ ,, 90,080 వాణిజ్య, 4847 ఇండస్ట్రియల్, 20,688 వీధి దీపాల కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు 11 మిలియన్ యూనిట్ల సాధారణ వినియోగం ఉంటుంది. ప్రస్తుతం 10 -12 మిలియన్ యూనిట్ల వరకు రోజు వారి వినియోగం ఉంటోంది. 2023 ఫిబ్రవరిలో 508 మిలియన్ యూనిట్లు ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 591, మార్చి 508 మిలియన్ యూనిట్లు వినియోగం ఉంది.

ట్రాన్స్ ఫార్మర్లు లభ్యత ఎలా ఉంది.?

జిల్లాలో 31162 ట్రాన్స్ ఫార్మర్లున్నాయి. ఇందులో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 23073, సింగిల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్లు 8089 వరకు ఉన్నాయి.

నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా.?

కొత్తగా 4 సబ్ స్టేషన్లు (33కెవి) మంజూరయ్యాయి. గుంకలాం, పుర్రేయవలస, రామన్నదొరవలస, గుమడాం, వెదుల్లవలస సబ్ స్టేషన్లు నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చాం.



అంతరాయాల నివారణకు తీసుకున్న చర్యలు.?

24x7 నాణ్యమైన విద్యుత్తు సరఫరా, అంతరాయాల నివారణపై దృష్టిసారించాం. 33 కెవి, 11 కెవి, ఎల్‌టి విద్యుత్ లైన్లలో ఏర్పడే సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా సరిచేస్తున్నాం. దీని ద్వారా ట్రిప్పింగ్స్‌ను తగ్గించగలిగాం.

వేసవి తీవ్రత దృష్ట్యా విద్యుత్తు అంతరాయం లేకుండా చేపట్టిన జాగ్రత్తలు ఏమిటి.?

ప్రస్తుతం విద్యుత్తు వినియోగం 11 మిలియన్ యూనిట్లు ఉంది. ఇది కాస్తా 13 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉంది. అందుకనుగుణంగా అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసే విధంగా ముందస్తు చర్యలు తీసుకున్నాం.

వినియోగదారులకు విద్యుత్తు వినియోగంపై మీరిచ్చే సందేశం ఏమిటి.?

వేసవి నేపథ్యంలో సాధారణ వాడకం కంటే ఒకట్రెండు మిలియన్ యూనిట్లు అధికంగా వినియోగమయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు విద్యుత్తు వినియోగం వృథా చేయకుండా పొదుపుగా వాడితే ఎటువంటి ఇబ్బందులూ రావు. ముఖ్యంగా ఎసిల వినియోగం పెరిగే అవకాశముంది. ఎసి వినియోగదారులు 26 డిగ్రీల వద్ద ఉంచి, ఫ్యాన్ 1లో ఉంచుకుంటే విద్యుత్తు వినియోగం ఎక్కువ కాకుండా ఆదా కావడంతోపాటు బిల్లు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వినియోగదారులు విద్యుత్తు పొదుపు చర్యలు పాటించి సహకరించాలి.

విద్యుత్తు అంతరాయం వస్తే తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

విద్యుత్తు అంతరాయం, ఎటువంటి ఇబ్బందులు వచ్చినా మండలాల్లో ఉన్న ఎఇలకు ఫోన్ చేసి తెలియజేయాలి. విద్యుత్తు శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలి. దీంతోపాటు ఆయా సబ్ డివిజన్లలో ఉన్న డిఇఇలు.. విజయనగరం టౌన్ -1 డిఇఇ-9440812455, టౌన్ -2 డిఇఇ-9440812457, చీపురుపల్లి డిఇఇ-9440812397, భోగాపురం డిఇఇ-7382585683, గజపతినగరం డిఇఇ-9491049812, ఎస్.కోట డిఇఇ-9440812458, బొబ్బిలి టౌన్ డిఇఇ-9440812459, బొబ్బిలి రూరల్ డిఇఇ-7382585684, సాలూరు డిఇఇ- 9440812461, పార్వతీపురం డిఇఇ-9440812460, పార్వతీపురం ఐటిడిఎ డిఇఇ- 9440812462, రాజాం డిఇఇ-9440812396 నంబర్లను సంప్రదించాలి.



నాగళ్లు తయారు చేస్తున్న వడ్రంగులు

ఉగాదికి సిద్ధమవుతున్న కొత్త నాగళ్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది సందర్భంగా కొత్త నాగళ్లను సిద్ధం చేసే పనిలో వడ్రంగులు ఉన్నారు. ప్రతి ఏటా ఉగాది రోజు తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున రైతులు కొత్త నాగళ్లతో పొలంలో దుక్కులు చేపడుతున్నారు. మండలంలోని ఉల్లిభద్ర, రావివలస, గరుగుబిల్లి, పెద్దూరు, బురదవెంకటాపురం, పెదగుడబ, చినగుడబ, రావుపల్లి, చినగుడబ, తదితర గ్రామాల్లో కొత్త నాగళ్లు తయారు చేసిన అనంతరం రైతులు కొత్త అమావాస్య రోజున సాయంత్రం వీటిని తయారు చేసిన వృత్తి పనివారి ఇంటి వద్ద పూజలు నిర్వహిస్తారు. అనంతరం రైతులు నాగళ్లను ఇంటికి తీసుకెళ్తారు. ఉగాది రోజు ఉదయం రుత్వికులు నిర్ణయించిన ముహూర్తం మేరకు పొలానికి వెళ్లి దుక్కలు చేపడతారు.



మహిళలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న గౌస్

నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేటలోని నిరు పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండగను పురస్కరించుకొని ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆదివారం నిత్యావసర సరుకులు బియ్యం, పంచదార, గోధుమ పిండి, సేమియా, వంట నూనె బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గ్రామంలోని 15 నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేశామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గ్రామంలోని ప్రతి ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఎటువంటి తారతమ్యం లేకుండా పండగను జరుపుకోవాలన్నారు. అలాగే రాబోవు రోజుల్లో మరికొంత మంది దాతల సహకారంతో పేద ముస్లిం కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.



జీడితోటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

జీడి రైతులకు భరోసా ఏదీ?

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల 8మంది గిరిజన మండలంలో జీడి పండించే రైతులకు భరోసా లేదానని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం ఐటిడిఎ ఉందని చెప్పుకోవడం తప్ప గిరిజనులకు భరోసా లేదని విమర్శించారు. ప్రతి గిరిజన గ్రామానికి వెళ్లి జీడి పిక్కలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా అటు ఐటిడిఎ అధికారులతో పాటు వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు ఆలోచించాలని కోరారు. ఐటిడిఎ కొనుగోలు చేయకపోవడంతో కిలో జీడి పిక్కలు గత ఏడాది రూ.60 నుంచి రూ.70కు దళారులకు అమ్ముకొనే పరిస్థితి ఉందన్నారు. ఈ ఏడాది కూడా గత ఏడాది కన్నా తక్కువ పంట వచ్చిన సందర్భంలో ఇప్పటికే గిరిజన రైతులు సేకరించిన జీడిపిక్కలను కిలో రూ.60 నుంచి రూ.70కు పార్వతీపురం తెచ్చి దళారులకు అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిలో జీడిపిక్కలు రూ.200కు కొనుగోలు చేసి గిరిజనులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ దుర్వినియోగం : టిడిపి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో వైసిపి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాపయ్యవలసకు చెందిన వాలంటీరు యామల రాంబాబు, కాశీపట్నం యాదవ వీధికి చెందిన బాగు రామకృష్ణ పాల్గొన్నారని టిడిపి నాయకులు తెలిపారు. ఈ ప్రచారంలో వైసిపికి ఓటు వేయకపోతే పెన్షన్లు ఇతర సంక్షేమ పథకాలు అందకుండా చేస్తామని ఓటర్లను భయపెట్టారని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మండల టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు విలేకరులతో మాట్లాడారు. వాలంటీర్లు వైసిపి ప్రచారంలో పాల్గొన్న వివరాలను ఆధారాలతో సహా ఎంపిడిఒ దేవకుమార్‌కు, ఐటిడిఎ పిఒ, సాలూరు ఆర్ఒ విష్ణుచరణ్‌కు, జిల్లా కలెక్టర్‌కు, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలను, ఎన్నికల నియమాలని పక్కనపెట్టి వైసిపి తరపున ప్రచారంలో పాల్గొని ఓటర్లను భయపెడుతున్న వాలంటీర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా గతంలో కూడా అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆ వాలంటీర్లను విధుల నుంచి తొలగించామని, ప్రస్తుతం గ్రామ సచివాలయ కార్యదర్శి లేనందున వేరొకరికి బాధ్యతలు అప్పగించామని, సోమవారం ఈ చర్యలు చేపడుతామని ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారన్నారు.



వైద్యసిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న సూపరింటెండెంట్ నాగభూషణం

ఆరోగ్యం కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ


ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి పట్టణంలో పలు వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చిరంజీవి, భారతి, తదితరులు ఉన్నారు.

పెద్దబొండపల్లిలో సాయిమందిరం వార్షికోత్సవం

పార్వతీపురం రూరల్ : మండలంలోని పెదబొండపల్లిలో షిర్డీ సాయి మందిరం మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలు షిరిడి సాయి సేవాశ్రమం పార్వతీపురం చెందిన సాయి సేవకులు భోగలింగం ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం గ్రామంలో సాయిబాబా చిత్రపటం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.



ఊ అంటారా.. ఊఊ అంటారా?



- సంధ్యారాణి, పిటిఆర్ మధ్య నేడు చర్చలు
- మధ్యవర్తిత్వం నెరపనున్న టిడిపి అగ్రనేతలు
- నేడు బొబ్బిలి కోటలో రాజకీయ రాయభారం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో టిడిపి అసంతృప్తి నాయకులను బుజ్జగించేందుకు పార్టీ అధినాయకత్వం ఎట్టకేలకు రంగంలోకి దిగనుంది. టిడిపిలో గత కొంతకాలంగా ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి, సీనియర్ నాయకులు పెంట తిరుపతి రావు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. మక్కువ మండలానికి పెద్ద దిక్కుగా ఉన్న తిరుపతిరావుతో సమన్వయం చేసుకోడానికి సంధ్యారాణి ససేమిరా అంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆమెను పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి దాదాపు నెల రోజులు దాటింది. గెలుపు కోసం శత్రువునైనా కలుపుకుని పోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ ఆమె ఆ దిశగా అడుగులు వేయడం లేదు. సొంత పార్టీ నేతలను వదులుకోవడానికి కూడా ఆమె సిద్ధమవుతున్నారు. ఆయనంతట ఆయనే పార్టీ విజయం కోసం పని చేస్తారని సంధ్యారాణి ఇంతవరకు ఎదురు చూశారు. సంధ్యారాణి నేరుగా తనతో మాట్లాడితే గాని పార్టీ గెలుపు కోసం పని చేయనని తిరుపతిరావు భీష్మించుకుని ఉన్నారు. ఈలోగా కొంతమంది ఆయన అనుచరులతో సంధ్యారాణి రాయభారం పంపినా తిరుపతిరావు సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆమె మాత్రం మక్కువ మండలంలో తన అనుచరులతో కలిసి ప్రచారం చేసుకుంటున్నారు. సంధ్యారాణితో సయోధ్య కుదరకపోతే ఇండిపెండెంట్ అభ్యర్థిని రంగంలోకి దించాలనే యోచనలో పెంట తిరుపతిరావు వున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సంధ్యారాణితో సయోధ్య కుదరాలంటే ముందు తన డిమాండ్లకు తలొగ్గాలనే సంకేతాలను తిరుపతిరావు పంపించారు. మండల పార్టీ అధ్యక్షుడిగా తాను సూచించిన వ్యక్తే వుండాలని, తన కనుసన్నల్లో మండల పార్టీ నడవాలని, తాను ఏది చెపితే అదే జరగాలని తిరుపతిరావు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీకి తిరుపతిరావు దూరమైన తర్వాత మండల పార్టీ అధ్యక్షుడిగా గుళ్ళ వేణుగోపాలరావును ఆమె నియమించారు. వేణుగోపాలరావు ద్వారానే మండలంలో పార్టీని నడిపిస్తున్నారు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి తర్వాత తిరుపతిరావు బిజెపిలో చేరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొన్నాళ్లు పని చేశారు. జిల్లాలో బిజెపికి ఎదుగూబొదుగూ లేకపోవడంతో ఏడాది క్రితం ఆయన అమరావతిలో చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరిపోయారు. తిరుపతిరావు చేరికను సంధ్యారాణి తీవ్రంగా వ్యతిరేకించినా అధిష్టానం మాత్రం ఆయనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ పెంట తిరుపతిరావు చేరికను స్వాగతించారు. పార్టీలో చేరిన తర్వాత గానీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత గానీ సంధ్యారాణి తిరుపతిరావును కలుపుకు పోయే ప్రయత్నం చేయలేదు. పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గొర్లి విజయకుమారి భర్త, పట్టణ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు గొర్లి మధుసూదనరావు ఇటీవల వైసిపిలో చేరారు. మధుసూధనరావుతో కూడా సయోధ్యకు సంధ్యారాణి అంగీకరించకపోవడంతో ఆయన అధికారపార్టీకి దగ్గరయ్యారు. సంధ్యారాణికి సీటు ఇవ్వొద్దని మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌తో పాటు ఆయన అనుచరులు గట్టిగా అధిష్టానానికి చెప్పినా ఫలితం లేకపోయింది. ఐదేళ్లుగా నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న సంధ్యారాణినే ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. అధిష్టానం అభ్యర్థిని ప్రకటించినా పార్టీలో ఆమె వ్యతిరేకులను దారిలోకి తెచ్చే ప్రయత్నాలు ఇంతవరకు చేయలేదు. ఎమ్మెల్యే టికెట్ సాధించడంలో విజయవంతమైన సంధ్యారాణి ఎమ్మెల్యేగా గెలుపు సాధించినట్లేనన్న భావనతో వున్నట్లు కనిపిస్తున్నారు. టిడిపి రాష్ట్ర నాయకత్వం ఆదేశించినా సంధ్యారాణి సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావుతో సయోధ్య కోసం ప్రయత్నించలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో టిడిపి నాయకత్వం రంగంలోకి దిగనుంది. పార్టీ రాష్ట్ర నాయకులు దామచర్ల సత్య, మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు మధ్యవర్తిత్వంలో సోమవారం బొబ్బిలిలో సంధ్యారాణి, పెంట తిరుపతిరావుతో చర్చలు జరుపనున్నారు. తన డిమాండ్లను సంధ్యారాణి ఆమోదిస్తే గాని సయోధ్యకు అంగీకరించేది లేదని భీష్మించుకున్న పెంట తిరుపతిరావు అగ్రనేతల సలహాలు సూచనల మేరకు తలొగ్గుతారా, లేదా అన్నది తేలాల్సి ఉంది. తిరుపతి రావు డిమాండ్లకు తలొగ్గి అధిష్టానం పెద్దల సలహాలను సంధ్యారాణి గౌరవిస్తారా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. నియోజకవర్గంలో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు ఆలస్యంగా రంగంలోకి దిగిన అధిష్టానం దూతలు చర్చలు జరిపిన తర్వాత కూడా సంధ్యారాణి ఊ అంటారా,ఊఊ అంటారా సోమవారం తేలిపోనుంది.

విచారణ పేరుతో కాలయాపన

షాపు అద్దె ఏమైందో తేల్చడానికి రెండు నెలలు
తాజాగా టిపిఒకు బాధ్యతలు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపు అద్దె బాగోతంపై విచారణ జరిపించే ఉద్దేశం మున్సిపల్ కమిషనర్‌కు లేనట్లు కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ అమలు కాకముందు జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి స్పందిస్తూ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కౌన్సిల్‌లో చెప్పారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తోంది. కానీ విచారణ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు. ఫిబ్రవరి 17న షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపును మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పరిశీలించారు. ఈ షాపు ఖాళీగా ఉందని అధికారులు చెప్పడంతో అనుమానం వచ్చిన కౌన్సిలర్లు ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ షాపు ఖాళీగా లేదని, పట్టణానికి చెందిన ఓ ఛార్టర్డ్ అకౌంటెంట్ అధీనంలో ఉందని నిర్ధారణ చేశారు. అక్కడ నుంచి షాపు యజమాని అయిన ఛార్టర్డ్ అకౌంటెంట్‌తో ఫోన్‌లో మున్సిపల్ ఆర్వో రాఘవాచార్యులు మాట్లాడారు. 2017 నుంచి షాపు తన అధీనంలో వుందని, అద్దె చెల్లించలేదని ఛార్టర్డ్ అకౌంటెంట్ అధికారులకు చెప్పడంతో ఖంగు తిన్నారు. ఈ వ్యవహారంలో మున్సిపల్ రెవిన్యూ అధికారులు, పాలకుల కుమ్మక్కు విషయం బట్టబయలైంది. ఆయనతో అద్దె డబ్బులు కట్టించాలి. కానీ ఆయన చెల్లించడం లేదు.ఎందుకు చెల్లించడం లేదని నిశితంగా పరిశీలిస్తే ఆయన పట్టణానికి చెందిన ఓ పాలకవర్గ బాధ్యుడికి అద్దె డబ్బులు మొత్తం చెల్లించారనే ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంలో అధికారపార్టీకి చెందిన ముఖ్య నేత ప్రమేయం వుండడంతో ఈ బాగోతాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోంది. రెండు నెలలుగా విచారణ పేరుతో మున్సిపల్ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఈ గోల్ మాల్ వ్యవహారంపై విచారణ జరపాలని మున్సిపల్ ఎఇ సూరి నాయుడుకు తొలుత బాధ్యతలు అప్పగించారు. తనకు సంబంధం లేని వ్యవహారం కావడంతో తాను విచారణ జరపలేనని ఎఇ స్పష్టం చేశారు. ఇది జరిగి పదిరోజులు కావస్తోంది. ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారి పద్మావతికి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వచ్చి వారం రోజులు కావస్తున్నా ఆమె ఇంకా విచారణ ప్రారంభించలేదు. టౌన్ ప్లానింగ్ గుమాస్తా సంజయ్ సెలవులో ఉన్నందున ఇంకా విచారణ ప్రారంభించలేదని టిపిఒ పద్మావతి చెప్పారు. ఆయన లేకుండా తానొక్కదాన్నే విచారణ చేపట్టలేనని ఆమె చెపుతున్నారు. విచారణ పేరుతో షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారాన్ని తొక్కిపెట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి చెందిన కీలకనేత జోక్యం ఉన్నందున అధికారులు విచారణ జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ ఖజానాకు జమ కావాల్సిన షాపు అద్దె డబ్బులు లక్షలాది రూపాయలు పక్కదారి పట్టడం చర్చనీయాంశమవుతోంది.





సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఇందిర

ఆశా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాకాడ ఇందిర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కొమరాడలో సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశ అనంతరం ఇందిర మాట్లాడుతూ ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. కనీసం వేతనం రూ.26వేలు ఇచ్చే పరిస్థితి లేదని, అలాగే సంక్షేమ పథకాలు కూడా అమలు చేయని పరిస్థితి ఉందని తెలిపారు. టిఎ, డిఎలు కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. కరోనా సమయంలో అనేక మంది ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు మరణించినప్పటికీ వారి కుటుంబాలకు నేటికీ ఎటువంటి భరోసా కల్పించిన పరిస్థితి లేదని తెలిపారు. ఉపాధి పనులు కూడా కల్పించిన పరిస్థితి ఉందన్నారు. కావున వెంటనే అధికారులు స్పందించి ఆశా వర్కర్లకు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, సుమలత, గంగమ్మ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు కె.దుర్గమ్మ, ఆర్.అనసూయమ్మ, పలు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.



ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ముమ్మరంగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలస, నడిమి సందివలస, మడక వానివలస గ్రామాల్లో వైసిపి నాయకులు ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, ఆయనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బడే చిట్టి నాయుడు, శ్రీరంజన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలజంగి జోగారావు కోరారు. పట్టణంలోని మూడోవార్డులో గల వివేకానంద కాలనీలో పలు వీధుల్లో గడప గడపకు వెళ్లి ఓటర్లను కలుసుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మళ్లీ గెలిపించి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని, తమకు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వార్డు పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు..

వీరఘట్టం : మండలంలోని చిదిమి, యు.వెంకంపేట, పివిఆర్ పురం, తుడి గ్రామాల్లో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయంలో పార్టీలు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. మరోసారి వైసిపి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని ఆమె ప్రజలను కోరారు. ఎంపీపీ డి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, పాలకొండ ఎఎంసి వైస్ చైర్మన్ పి.లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీలు
అగ్రిగోల్డ్ బాధితుల పక్షమా? యాజమాన్యం పక్షమా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రిగోల్డ్ బాధితుల పక్షమా, అగ్రిగోల్డ్ యాజమాన్యం పక్షమా అని అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఐవి నాయుడు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ ఆర్‌విఎస్ కుమార్ ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి అసోషియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అనేక ధర్నాలు, దీక్షలు చేసి కొంత వరకు విజయం సాధించామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పటి ప్రతిపక్షనేతగా అగ్రిగోల్డ్ బాధితుల దీక్షా శిబిరానికి వచ్చి మూడు నెలల్లో రూ.10వేలు లోపు బాధితులకు ఆరు నెలల్లో మిగిలిన అందరు బాధితులకు వడ్డీతో సహా చెల్లిస్తామని అలాగే చనిపోయిన బాధితులకు చంద్రబాబు నాయుడు రూ.3లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పగా రాబోయే ప్రభుత్వం మనదేనని మన ప్రభుత్వం వచ్చిన వెంటనే బాధితులకు మరో రూ.7లక్షలు కలిపి రూ.10లక్షలు పువ్వుల్లో పెట్టి పంపిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికైనా అగ్రిగోల్డ్ బాధితులను గుర్తించి రూ.పది లక్షల అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లను సాధించుకొనేందుకు తమ ఉమ్మడి మేనిఫెస్టోలో పొందుపర్చామని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు, సభ్యులు వెల్లంకి గోవింద, బొండపల్లి శ్రీరాములు, బాసిగాన వెంకటరమణ (చిరు), ఎం. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు..

ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి : డిఎంఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్



సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యంపైనే దృష్టి పెట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. తరచుగా రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండే స్థాయిని నిర్ణయించేది మనలో ఉండే రోగనిరోధక వ్యవస్థ పనితీరు పై ఆధారపడి ఉంటుందని అన్నారు. రోగనిరోధక శక్తి మెరుగ్గా ఉండడానికి అవసరమైన జీవనశైలి తప్పనిసరి అని అన్నారు. కానీ ప్రస్తుత మారుతున్న జీవనవిధానంలో అనేక ప్రత్యామ్నాయ మార్గాలు మనిషిని శారీరక శ్రమకు దూరం చేస్తున్నాయని, వీటితో పాటుగా మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణం, పరిసరాలు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపి అనేక రుగ్మతలకు దారితీస్తుందన్నారు. ప్రతిరోజూ తగినంత శ్రమ ఉండాలని, అందుకు తగ్గ సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని అన్నారు. మన శరీరంలో నీరు, లవణాల సమతుల్యతకు అవరోధం లేకుండా ఉండాలని అన్నారు. అందుకు తగ్గ ఆహార నియమాలు పాటించాలన్నారు. శాఖాహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, నూనె, కొవ్వు పదార్థాలు కలిగిన ఆహారాన్ని చాలా వరకు తగ్గించుకోవడం ద్వారా హృద్రోగ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. సేంద్రీయ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులు మరింత ఆరోగ్యకరమని అన్నారు. అలాగే మనం నివసిస్తున్న ప్రదేశంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు, మురుగు నీరు, చెత్త లేకుండా చూసుకోవాలని సూచించారు. లేకపోతే దోమల ప్రభావం వల్ల పలు అనారోగ్య సమస్యలు సోకుతాయన్నారు. కాలానుగుణంగా ప్రబలే ఆరోగ్య సమస్యలు, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. అప్పుడప్పుడు మన ఆరోగ్యం విషయమై స్వయం పరిశీలన చేసుకోవడం, ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా జాప్యం చేయక అందుబాటులో ఉన్న వైద్యసేవలను వినియోగించుకోవడం, ఆరోగ్య సూచనలు, సలహాలు పాటించడం మొదలగు వాటివల్ల జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవచ్చు అన్నారు. అలాగే మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరమని, అనవసరమైన ఒత్తిడి, నిద్రలేమి, దుర్వాసనాలు మొదలగునవి మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపుతాయన్నారు. నివసించే ప్రదేశాల్లో మొక్కలు, చెట్లు పెంచాలని తద్వారా ఆక్సిజన్ సమృద్ధిగా లభించి ఆరోగ్యం మెరుగుపడేందుకు తోడ్పడుతుందన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ ఉండాలన్నారు. ముఖ్యంగా సకాలంలో రోగనిరోధక టీకాలు వేయించడంతో పలు ప్రాణాంతకమైన వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. గర్భిణుల ఆరోగ్యం చాలా ముఖ్యమని, రక్త హీనత, హైరిస్క్ సమస్యలు లేకుండా నివారించడం వల్ల పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా, మెరుగైన రోగనిరోధక శక్తి కలిగి ఉంటారన్నారు..

ఈ మలుపులు ప్రమాదానికి పిలుపులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి , రేగులపాడు, బొడ్లపాడు, పాపంపేట, వండువ, చిట్టిపూడి వలస, కడకెల్లా, తదితర గ్రామాల వద్ద గల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. రోడ్లు, భవనాల శాఖ అధికారులు ప్రధాన మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో పాటు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు కూడా తొలగించకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ఈ మలుపుల వద్ద సంకిలి షుగరు ప్యారిస్ వారు ఇటీవల కాలంలో రాత్రి సమయంలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. అయితే ఇవి మూడు రోజులు ముచ్చటగానే పనిచేసి మూలకు చేరడంతో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గత ఏడాది చిదిమి మలుపు వద్ద భారీ వాహన అతివేగంగా వస్తూ మలుపును గుర్తించకపోవడంతో వంతెన గోడకు ఢీకొనింది. అయితే ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా పాపంపేట మలుపు వద్ద ఎటువంటి ఆనవాళ్ల లేకపోవడంతో తెట్టంగికి సుమన్ అనే యువకుడు కల్వర్టును ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు విడిచిపెట్టాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన మలుపుల వద్ద ప్రమాదాల నివారణ బోర్డులతో పాటు రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిదిమి గ్రామ మలుపు వద్ద వంతెన గోడను ఢీకొన్న లారీ





నర్సిపురం గ్రామానికి వెళ్లిన ప్రధాన మలుపు

జయకృష్ణ గెలుపునకు కృషి

ప్రజాశక్తి - వీరఘట్టం

జనసేన నాయకుడు నిమ్మక జయకృష్ణ గెలుపునకు కృషి చేస్తామని టిడిపి నాయకులు తెలిపారు. మండలంలోని ఎం.రాజపురంలో టిడిపి నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని తూర్పు కాపులంతా జయకృష్ణ వెంటే ఉంటామన్నారు. ఆయన గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జయకృష్ణ సోదరుడు నిమ్మక పాండురంగారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పల నాయుడు, అరుకు పార్లమెంటరీ తూర్పుకాపు కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి పొన్నాడ నాగేశ్వరావు, వీరఘట్టం, భామిని, సీతంపేట, పాలకొండ మండలాలకు టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.